క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



గాడుబావి వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో వెలసిన గాడు బావి వీరాంజనేయస్వామి, గౌరి పేటలో వెలసిన ఆంజనేయ స్వామి, పలక చింత మాను,కనుమ ఆంజనేయస్వామి ఆలయంలో జ్యేష్ట అమావాస్య పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకుపూజ, మహామంగళహారతి ఇచ్చారు. బనగానపల్లె రహదారిలోని పుట్ట పెద్దమ్మ ఆలయంలో, సిమెంట్ నగర్‌లో వెలసిన సుంకులా పరమేశ్వరి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

సేవా గుణం అలవర్చుకోవాలి



పింఛన్ అందజేస్తున్న ప్రకృతి పీఠం అధ్యక్షుడు

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దానధర్మాలు చేయాలని ప్రకృతి పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి చెప్పారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల ప్రక్రియను శుక్రవారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ అధికారి పెనుగొండబాబు, వాల్మీకి సంఘం నాయకుడు సుబ్బయ్య, ఉపాధి హామీ పథకం మేటి రాములమ్మ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్యాపిలి: పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ సాయిమనోహర్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. మురుగు నిలువ ఉండకుండా చూడాలని, తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని సూచించారు. ట్యాంకు శుభ్రం చేసిన తేదీ, తిరిగి శుభ్రం చేయబోయే తేదీని ట్యాంకులపై రాయాలన్నారు. వైద్య సిబ్బంది సహకారం తీసుకుని ప్రజలకు ఆరోగ్య సూచనలు ఇవ్వాలన్నారు.

8 నుంచి ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

బేతంచెర్ల: కాకినాడలో జూలై 8,9,10 తేదీలలో నిర్వహించే ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం శిక్షణా తరగతుల పోస్టర్లలను నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్, మనోహర్, ఇసాక్, దుష్యంత్, శ్రీనివాసులు, ప్రసన్న కుమార్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన ఓ మైనర్ బాలిక అదృశ్యమైనట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఎస్ఐ అందించిన సమాచారం మేరకు.. కోవెలకుంట్లకు చెందిన బాలిక గురువారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితురాళ్ల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాలిక తండ్రి పోలీసులను ఆశ్రయించడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

భార్య, అత్తపై దాడి

కోవెలకుంట్ల: పట్టణంలోని ముదిగేడు చౌరస్తాలో పాలడెయిరీ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్న విజయలక్ష్మి, ఆమె కుమార్తె శ్రీలక్ష్మిపై అల్లుడు శ్రీకాంత్ దాడికి పాల్పడాడు. ఎస్ఐ వరప్రసాద్ శుక్రవారం అందించిన సమాచారం మేరకు బండి ఆత్మకూరు మండలం నారాయణాపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్‌తో విజయలక్ష్మి ఏడాది క్రితం వివాహం జరిగింది. ఇటీవల పుట్టింటికి వచ్చి తిరిగి కాపురానికి రాకపోవడంతో గురువారం సాయంత్రం ఆమె భర్త కోవెలకుంట్లకు వచ్చి అత్త, భార్యతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో వారిపై దాడి చేసి గాయపరిచాడు. విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నిఘా నేత్రాలే... శ్రీరామరక్ష!

- నాపరాతి గనుల్లో చోరీకి గురువుతున్న సామగ్రి
- పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్న యాజమాన్యాలు



గనిలో పని చేస్తున్న కార్మికులు (ఫైల్)

కొలిమిగుండ్ల: సీసీ కెమెరాలు (నిఘా నేత్రాలు) ఆస్తుల రక్షణకు శ్రీరామరక్షగా మారాయి. పెద్దపెద్ద నేరస్తులు, దోపిడీదారులు పట్టించి జైలుపాలుకు పంపిన ఘనత సీసీ కెమెరాలకే దక్కింది. పసిపిల్లల కిడ్నాప్, తప్పిపోయిన చిన్నారులను సైతం తల్లిఒడికి చేర్చాయి ఈ సీసీ కెమెరాలు. ఈ నేపథ్యంలో వ్యాపార సముదాయాలు, కార్యాలయాలు, గృహాలలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం సర్వసాధారణంగా మారింది. అయితే వీటి అవసరం గ్రామీణులకు సైతం ఏర్పడింది. బనగానపల్లె నియోజకవర్గంలో కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె మండలాల్లో 1,150 హెక్టార్లలో నాపరాతి గనులు విస్తరించి ఉన్నాయి. ఈపరిశ్రమలపై ఆధారపడి వేలాది కార్మిక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. గనుల్లో మొదట్లో అన్ని రకాల పనులు కార్మికులే చేస్తుండేవారు. కాలక్రమేణా టెక్నాలజీ గనులకు విస్తరించింది. డీజిల్‌తో పని చేసే కొత మిషన్‌లు అందుబాటులోకి రావడంతో యజమానులు వాటి పైనే ఆసక్తి చూపారు. ఐదారు మంది కార్మికులు చేసేపని తక్కువ మందితో కోత మిషన్‌ల ద్వారా చేయవచ్చు. కోత మిషన్లలో మరింత మార్పులు చోటు చేసుకున్నాయి. విద్యుత్ కోత మిషన్‌లు రావడంతో యాజమాన్యాలు డీజిల్ భారం నుంచి విముక్తి పొందేందుకు అధిక భాగం వాటిపై ఆసక్తి చూపారు. ఈ నేపథ్యంలో విలువైన సామగ్రి గనుల్లోనే ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. విలువైన సామాగ్రి అపహరణలకు గురువుతున్నాయని గనుల యాజమాన్యాలు పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నా ప్రయోజనం కలుగడం లేదు. దీంతో గనుల యాజమాన్యాలకు సైతం నిఘా నేత్రాలే శ్రీరామరక్షగా మారాయి. తప్పని పరిస్థితుల్లో గనుల వద్ద సీసీ కెమెరాలుఏర్పాటు చేసుకుంటున్నారు.

తరచూ చోరీలు

గనుల్లో దొంగల బెడద అధికమై తరచూ చోరీలు జరుగుతు వస్తున్నాయి. రాత్రి వేళల్లో గనుల వద్ద కాపాలా ఉన్నా సాధ్యపడడం లేదు. తప్పని పరిస్థితుల్లో వేల రూపాయలు ఖర్చు పెట్టి గనుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఫీజు క్యారియర్ నుంచి ట్రాన్స్‌ఫార్మర్ వరకు ఏర్పాటు చేసే విద్యుత్ తీగ గజం రూ.310–350 వరకు ఉంటుంది. దూరం మేరకు 30 గజాలకుపైగానే ఉపయోగిస్తుంటారు. 1హెచ్‌పీ నీళ్ల మోటార్లు రూ.6–10 వేల వరకు ఖరీదు చేస్తాయి. దొంగలు ఎక్కువ భాగం విద్యుత్ తీగలు, మోటార్లను అపహరిస్తుంటారు. వీటితో పాటు కోత మిషన్‌లకు చెందిన చిన్న చిన్న వస్తువులు, గని పనులకు ఉపయోగించే పని ముట్లను తీసుకెళ్తుతున్నారు.



బెలుం సమీపంలో నాపరాతి గని వద్ద అమర్చుకున్న సీసీ కెమెరాలు

గని విస్తీర్ణం మేరకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేసి గనుల్లో రెండు అంత కంటే కెమెరాలు బిగించుకుంటున్నారు యాజమాన్యాలు. చాలాచోట్ల దొంగలు చోరీ చేసి వెళ్లిపోతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో యాజమాన్యాలు దొంగలకు చిక్కిపోతున్నారు. దొంగలు తెలిసిన వ్యక్తులే కావడంతో కొందరు మందలించగా మరికొందరు దేహశుద్ధి సైతం చేసినట్లు సమాచారం.

భాష్యం స్కూల్ సీజ్



స్కూల్‌ను సీజ్ చేస్తున్న ఎంఈఓ ప్రభాకర్

డోన్ టౌన్ : పట్టణంలోని నూతనంగా ఏర్పాటు చేసిన భాష్యం స్కూల్‌ను శుక్రవారం ఎంఈఓలు ప్రభాకర్, రామనర్సప్ప సీజ్ చేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠశాలను నిర్వహిస్తున్నారని విద్యార్థి సంఘాలు నిరసనలు తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్ మరోమారు గురువారం అసిస్టెంట్ డైరెక్టర్ చాడేశ్వరీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు స్పందించిన ఎంఈఓలు భాష్యం స్కూల్‌ను సీజ్ చేశారు.

పోలీసుల అదుపులో చైన్ స్నాచర్

డోన్ టౌన్ : పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు క్లబ్ హౌస్ సమీపాన శుక్రవారం రాత్రి చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తిని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాత్రి భోజనం అనంతరం ఓ మహిళ రైల్వే స్టేషన్ రోడ్డులో వాకింగ్ చేస్తుండగా దుండగుడు చైన్ స్నాచింగ్‌కు పాల్పడగా ఆమె ప్రతిఘటించింది. స్థానికులు చైన్‌స్నాచర్‌ను పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదుపులోకి తీసుకున్న పోలీసులు దొంగ వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఐకమత్యంగా మెలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

డోన్ టౌన్ : ఎంప్లాయిస్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా క్లాస్3 ఉద్యోగులు ఐకమత్యంగా మెలగాలని, అప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని ఆ సంఘం కడప డివిజన్ అధ్యక్షుడు అవదానం శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయంలో శుక్రవారం బ్రాంచి అధ్యక్షుడు రహంతుల్లా అధ్యక్షతన జరిగిన సంఘం 33వ వార్షిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎల్ఐసీ సంస్థ 1960లో జాతీయకరణం జరిగిందని, మన సంఘం అంతకుముందే ఏర్పాటవ్వడమే కాకుండా కార్మికుల సమస్యపై పోరాడుతూనే ఉందుని గుర్తు చేశారు. అనంతరం డోన్ బ్రాంచి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రహంతుల్లా, కార్యదర్శిగా దేవన్న, సహాయ కార్యదర్శిగా కిరణ్‌కుమార్, కోశాధికారి వీరన్నతోపాటు ఈసీ మెంబర్లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐఐసీఐ సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు అక్బర్‌బాషా, జోనల్ కమిటీ వర్కింగ్ సభ్యులు సునియకుమార్, డివిజన్ సహాయ కార్యదర్శులు రమేష్, ఎస్వీఎస్ రాజు, బ్రాంచి మేనేజర్ రాముడు, డెవలప్‌మెంట్ అధికారుల సంఘం అధ్యక్షుడు నరహరి, ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, సీనియర్ నాయకులు రాఘవయ్య, శేషయ్య, సురేష్, కిరణ్, బీనారావు తదితరులు పాల్గొన్నారు.

జంప్ రోప్ పోటీల్లో డోన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు

డోన్ టౌన్ :జిల్లా కేంద్రం నంద్యాలలో ఈ నెల 3వ తేదీన జరిగిన జిల్లా స్థాయి జంప్ రోప్ అండర్ 14 విభాగం క్రీడలో పట్టణానికి చెందిన శ్రీసుధ హైస్కూల్ విద్యార్థులు ఉమేష్‌చంద్ర, యశ్వంత్, మహేష్, కార్తీక్, లాలువెంకటసాయి, రూపక్, పవన్, మనోజ్, అభినయ్, వినాయక్, సూర్యలు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు స్కూల్ కరెస్పాడెంట్ వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రతిభ కనబరచిన విద్యార్థులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు మనోహర్, హరి, జాన్‌ను అభినందించారు. కార్యక్రమంలో కరెస్పాడెంట్ సుధాకర్ గుప్తా, ప్రిన్స్‌పాల్ మ్యారి చార్లెస్, వైస్ ప్రిన్స్‌పాల్ చంద్రశేఖర్‌గౌడ్, కోఆర్డినేటర్ ఎలిజబేత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

కోవెలకుంట్ల:పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఇకోక్లబ్ సమన్వయకర్త రామసుబ్బారెడ్డి సూచించారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాణ్యం నర్సరీ నుంచి తెచ్చిన ఆల్మండ్, గన్నేరు, మందార, టికోమా, తదితర పూల మొక్కలు, కానుగ, మునగ, టెంకాయ తదితర మొక్కలను కళాశాల ఆవరణలో నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణశశాంక, అన్నపూర్ణ, లక్ష్మీదేవి, వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, శైలజ, పుల్లయ్య, నాగరాజు, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు



వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఎండీ యూనుస్

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ఎన్జీఓ కాలనీలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమాన్ని శుక్రవారం ప్రభుత్వ యునానీ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ ఎండీ యూనుస్ సందర్శించారు. వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు.యోగా, ధాన్యం పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని ఈ సందర్భంగా ఆయన వృద్ధులకు సూచించారు. యోగా, ధ్యానం చేయాల్సిన తీరును, కలిగే ప్రయోజనాలను మాస్టర్ తిరుమలయ్య వృద్ధులకు వివరించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు విజయలక్ష్మీ, యునానీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

సంజామల: ఆయిల్ పామ్ సాగు లాభదాయకమని, రైతులు ఆ దిశగా ముందుకు సాగాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నాగరాజు సూచించారు. మండల పరిధిలోని ఆల్వకొండ సచివాలయంలో శుక్రవారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన చర్చించారు. ఆయిల్ పామ్ సాగుకు శాఖ అందజేస్తున్న సబ్సిడీ, డ్రిప్ పరికరాల వివరాలను తెలిపారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ నీటి వసతి కలిగిన ప్రతి రైతు ఆయిల్ పామ్ చేసుకుని మంచి లాభాలును పొందవచ్చునన్నారు. ఆల్వకొండ, రెడ్డిపల్లె గ్రామాలలో దాదాపు 100 ఎకరాలు సాగు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ రామ కృష్ణారావు, పతాంజలి ఫుడ్ లిమిటెడ్ జిల్లా మేనజర్ మహాదేవయ్య, మండల ఉద్యానశాఖ అధికారి ధరణి, రైతు వ్యవసాయ సహాయకులు మానస, నరేష్, దివ్య, అబ్దుల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు



ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో భూసార పరీక్షలు చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్లు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురంలో శుక్రవారం రైతు కాంతరెడ్డి పొలంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు యశోధ, భారతి భూసార పరీక్షలు నిర్వహించారు. భూసార పరీక్షల ప్రయోజనాలను వారు రైతులకు వివరించారు. నేల సామర్థ్యం, నేలలోని పోషక విలువలు తెలుసుకుని మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు.

నేడు రేబిస్ టీకా స్పెషల్ డ్రైవ్



సమావేశంలో మాట్లడుతున్న ఏడీ డాక్టర్ మోహన్ రావు

సంజామల: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా రేబిస్ టీకాల స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశామని పశుసవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మోహన్ రావు తెలిపారు. మండల కేంద్రం సంజామల ప్రాంతీయ పశువైద్యశాల పశువైద్యులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఏడీ మాట్లాడారు. రేబిస్ వ్యాధి వైరస్ చాలా ప్రమాదమైనదని, పెంపుడు కుక్కల యజమానులు రేబిస్ వ్యాధి నిరోదక టీకాలు వేయించుకోవాలని సూచించారు. ప్రజలను చైతన్య పరిచి స్పెషల్ డ్రైవ్ విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యులు బాలకృష్ణ, శివనందా, రమేష్‌బాబు, పద్మావతి పాల్గొన్నారు.

నేడు పెంపుడు జంతువులకు వ్యాక్సిన్

కొలిమిగుండ్ల: వరల్డ్ జోనోసిస్ డే సందర్భంగా శనివారం స్థానిక పశువైద్యశాలలో యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేస్తున్నట్లు పశువైద్యాధికారిణి పద్మావతి తెలిపారు. పెంపుడు జంతువులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆమె సూచించారు.

బేతంచెర్ల: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు ఉచితంగా రేబిస్ నిరోధక టీకాలు వేస్తున్నామని బేతంచెర్ల పశువైద్యులు అజయ్ కుమార్ తెలిపారు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులని జూనోటిక్ వ్యాధులు అంటామని, తప్పనిసరిగా ఈ టీకా పెంపుడు కుక్కలకు వేయించాలని సూచించారు.

అవుకు: జూనోసిస్ డే సందర్భంగా అవుకు, గుండ్లశింగవరం గ్రామాల్లోని పశువైద్యశాలల్లో వ్యాక్సిన్ ఉచితంగా వేస్తున్నామని, పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా వేయించాలని అవుకు పశువైద్యాధికారిణి భారతీ దేవి సూచించారు. జూనోసిస్ వ్యాధులు (రేబీస్, అంత్రాక్స్, బ్రుసిల్లా) జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే అంటువాధ్యులని చెప్పారు.

అమ్మకు వందనం పథకాన్ని ప్రభుత్వ స్కూళ్లకే వర్తింపజేయాలి

బేతంచెర్ల: అమ్మకు వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపజేసి, స్కూళ్ల బలోపేతం చేయాలని పీఆర్టీయూ స్టేట్ సెక్రటరీ దానమయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం పట్టణంలోని పీఆర్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసిన 117జీవోను రద్దు పరిచి ఉన్నత పాఠశాల నుంచి ప్రాథమిక విద్యను వేరుచేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా కౌన్సిలర్ నాగ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు సురేంద్రనాథ్ రెడ్డి, హరి కృష్ణ, శంకర్ నాయక్, సుధాకర్, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి



కళాశాల ఆవరణలో పొక్లెయిన్‌తో ఇంకుడు గుంతలు తవ్వుతున్న దృశ్యం

డోన్ టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామని వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మలిశెట్టి జగన్‌మోహన్, అధ్యక్ష,కార్యదర్శులు నాగభూషణంరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కలబంద మొక్కలు నాటడంతోపాటు నీటి నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచే విధంగా చేపట్టిన ఇంకుడు గుంతల తవ్వకం పనులను శుక్రవారం వారు పరిశీలించారు. కళాశాలలో తమ సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ.30వేలు వెచ్చించి కబంద మొక్కలు నాటుతున్నామని, భూగర్భ జలాలు పెంచేందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నామని మలిశెట్టి జగన్‌మోహన్ తెలిపారు.

విజయభాస్కర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి

బనగానపల్లె రూరల్ : కొలిమిగుండ్ల మండలం కోరుమానుకొండ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లపై దుర్భాషలాడిన రేషన్ డీలర్ విజయభాస్కర్‌రెడ్డి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వెంకటకృష్ణుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయభాస్కర్‌రెడ్డి రేషన్ బియ్యం బస్తాలను తరగతి గదిలో ఉంచేందుకు ఉపక్రమించగా ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు ఎంఈఓ పర్మిషన్ తీసుకుంటామని చెప్పేలోపే చిందులు వేయడం సమంజసం కాదన్నారు. ఉపాధ్యాయుడని చూడకుండా భూతులు తిడితూ దాడియత్నం సరైన పద్ధతి కాదన్నారు. విజయభాస్కర్‌రెడ్డితోపాటు అతని అనుచరుల పై తక్షణమే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు, నాయకులు రామకృష్ణ, యాగంటప్ప, వీరన్న, గోవిందనాయక్, బాలాజీనాయక్, శేఖర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

మాడవీధుల్లో తిరుచ్చి మహోత్సవం



బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రం మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో జ్యేష్ట మాసం శుక్రవారం రాత్రి మాడవీధుల్లో తిరుచ్చి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు వేదపండితులు జ్వాళ చక్రవర్తి, ప్రధాన అర్చకుడు మద్దిలేటి స్వామి తదితరులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామివారి ఊరేగింపు కనుల పండువగా సాగింది. గోవిందనామ స్మరణాల మధ్య స్వామివారు పుష్పాలంకరణ శోభితుడై భక్తులకు దర్శనమిచ్చాడు. అర్చకులు నరసింహ, చిన్న మద్దిలేటిస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

అవుకు: మండల పరిధిలోని వేములపాడు గ్రామానికి చెందిన రైతు ఉప్పరి నర్సిపల్లె సంటెన్న (42) శుక్రవారం మృతి చెందాడు. ఉప్పరి నర్సిపల్లె సంటెన్న అప్పులబాధ తాళలేక క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తుల సమాచారం. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోండి



పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న ఉమామహేశ్వరి

అవుకు: ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ ఉమామహేశ్వరి సూచించారు. శుక్రవారం మండల కేంద్రం అవుకులోని అంగన్‌వాడీ నాల్గవ సెంటర్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సీడీపిఓ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ప్రతి నెలా ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో ఫేస్ రికగ్నిజేషన్ చేసుకొని పోషకాహార కిట్లను తీసుకెళ్లాలని వారికి సీడీపీఓ సూచించారు. కార్యక్రమంలో సైపర్‌వైజర్ పావని, టీచర్ పర్వీన్, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీడీపీఓ ఉమామహేశ్వరి

అవుకు: ఆడపిల్లలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీఓ ఉమామహేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కేజీబీవి పాఠశాలల్లో బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఆడపిల్లలు విద్యార్థిని దశ నుంచే శారీరకంగా మనసికంగా దృఢంగా తయారవ్వాలని సూచించారు. అలాగే విద్యార్థి దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. సమస్యలు ఎలా పరిష్కరించుకోవాలి, సమాజంలో ఎలా మెలగాలి అనే అంశాలపై ప్రసంగించిన విద్యార్థినులకు ఆమె ప్రోత్సాహక బహుమతుల అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శివమ్మ, పావని, ఆదర్శ, కేజీబీవి ప్రిన్సిపాల్స్ హెమీమా, భవానీ తదితరులు పాల్గొన్నారు.